ప్రజాశక్తి

మంగళవారం 10 జూన్ 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

మేఘాలు దోబూచులు

10 రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు - ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులకు ఆటుపోటు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఈ ఏడాది రైతులకు ఆటుపోటు ప్రారంభమైంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా మేలో విస్తారంగా వర్షాలు కురవగా నైరుతీ రుతుపవనాలు వచ్చేశాయన్న వాతావరణ శాఖ అంచనాలను తలకిందులు చేస్తూ గత 10 రోజులుగా వర్షాలు ముఖం చాటేశాయి. ఉదయం 5 గంటల ప్రాంతంలో, సాయంత్రం 5 గంటల ప్రాంతంలో జిల్లాలోని పలు ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురుస్తుందన్నట్టుగా కన్పించినా అంతలోనే మేఘాలు మాయమైపోతున్నాయి. గత నెల 29వ తేదీ వరకు కాలంకాని కాలంలో పలు ప్రాంతంలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. సాగుకు సానుకూలత ఏర్పడిందని అధికారులు అంచనా వేస్తున్న క్రమంలో రెండ్రోజుల్లో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులొచ్చాయి.

గత నెలలో దాదాపు 31 రోజుల్లో 10 రోజులు వర్షాలు కురిశాయి. మే నెలలో జిల్లా సగటు వర్షపాతం 62.2 మిల్లీ మీటర్లు కాగా రికార్డు స్థాయిలో 222.7 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. జనవరి, ఫిబ్రవరి, మార్చిలో సున్నా వర్షపాతం నమోదైంది. ఏప్రిల్‌లో సగటు వర్షపాతం 12.6 మిల్లీ మీటర్లు కాగా 25.8 నమోదైంది. మే నెలలో మాత్రం అంచనాలకు భిన్నంగా అధిక వర్షం కురిసింది. జూన్‌లో 97.1 మిల్లీ మీటర్ల వర్షం కురుస్తుందని అంచనా కాగా ఇప్పటి వరకు కేవలం 0.3 మిల్లీ మీటర్ల వర్షపాతమే నమోదైంది. గత 10 రోజుల్లో కనీసం 29 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉన్నా ఒక్క మిల్లీ మీటరు కూడా కురవలేదని అధికారులు తెలిపారు.

10 రోజులుగా వేడిగాలులు పెరిగాయి. ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవి తీవ్రతకు తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరమ్మతులకు తగిన సిబ్బంది లేక సకాలంలో అధికారులు స్పందించడంలేదు. దీంతో గంటల తరబడి చెమటలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గత నెలలో కురిసిన వర్షాలతో రోహిణీ కార్తె ప్రభావం లేదని భావించిన ప్రజలకు నిరాశ ఎదురైంది. గత నెల 30 నుంచి రోహిణీ కార్తె ప్రభావం కనిపిస్తోంది.

సోమవారం గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలు మండలాల్లో గరిష్టంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌కు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకుంటున్న రైతులు సాగుపై ఆచితూచి అడుగులేస్తున్నారు. ఇప్పటికే మేలో కురిసిన వర్షాలతో తొలకరి పంటల సాగుకు అవకాశం ఉన్నా మళ్లీ ఎండలు పెరగడంతో సాగుపై రైతులు వెనక్కి తగ్గారు. దీంతో ఖరీఫ్‌లో సాగు కొంత జాప్యమయ్యే అవకాశం కన్పిస్తోంది. జూన్‌లో ఇప్పటి వరకు వర్షమేమీ లేని కారణంగా ఈ ఏడాది సాగులో జాప్యం అనివార్యంగా కన్పిస్తోంది.

దిగివచ్చిన ప్రభుత్వం

ఎస్‌జిటిలకు నేటి నుంచి మ్యాన్యువల్‌గా కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీల ప్రక్రియలో వెబ్ కౌన్సెలింగ్ విధానం అంగీకరించబోమని, మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఆందోళన నేపథ్యంలో ఆదివారం రాత్రి ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. మాన్యువల్ కౌన్సిలింగ్‌కు అంగీకరిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం రాత్రి నిర్ణయం తీసుకున్నారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్‌కు ఎవ్వరూ తమ పేర్లు నమోదు చేసుకోకపోవడం వల్ల ప్రభుత్వం పునరాలోచించి మాన్యువల్ కౌన్సెలింగ్‌కు అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఒకటి నుంచి 300 వరకు ఉపాధ్యాయులు తమ మాన్యువల్‌గా తమ ఆప్షన్లను నమోదు చేస్తారని తెలిపారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

తెనాలి ఘటన మానవ హక్కుల ఉల్లంఘన

- బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

తెనాలిలో ఇటీవల దళిత, మైనార్టీ యువకులను దారుణంగా కొట్టిన పోలీసుల చర్యలపై న్యాయ విచారణ జరపాలని, సంబంధిత పోలీసుల్ని సస్పెండ్ చేయాలని ప్రజా, దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్, డిబిఎఫ్, డిబిఎస్‌యు ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అధ్యక్షత వహించి మాట్లాడుతూ పోలీసులపై చర్యలు తీసుకునే వరకూ ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. తప్పు చేసిన

▶ 2లో

దంపతులపై రౌడీగ్యాంగ్ దాడి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి సెంటర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి అమానుషం ఘటన జరిగింది. మద్యం మత్తులో ఉన్న రౌడీ మూక ఐదు నెలల గర్భవతితోపాటు ఆమె భర్తపై దాడి చేశారు. ప్రస్తుతం వారిద్దరూ విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై బాధితులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఉండవల్లి ఎస్సీ కాలనీలో నివసించే గూడవల్లి ఆనంద్, సునీత దంపతులు విజయవాడ రైల్వే డిపార్ట్మెంట్లో విధులు ముగించుకుని రాత్రి 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నారు. వీరి వాహనాన్ని ఉండవల్లి సెంటర్ సమీపంలో మద్యం మత్తులో ఉన్న రౌడీ గ్యాంగ్ ఢీకొట్టింది. భయాందోళనలకు గురైన భర్త ఆనంద్ వారించిన వినిపించుకోలేదు. పైగా మరొక వ్యక్తి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆగ్రహానికి గురైన ఆమె చెప్పుతో కొట్టడంతో దుండగుడు మరి కొంతమందికి ఫోన్ చేసి రప్పించుకుని దంపతులపై దాడికి పాల్పడ్డారు. దాడి చేసిన వారిలో మహిళ కూడా ఉన్నట్లు బాధితులు చెబున్నారు. తమను కాపాడేందుకు వచ్చిన ఇతర వాహనదారులు, స్థానికులను చంపేస్తామని రౌడీగ్యాంగ్ బెదిరించడంతో ఎవరూ తమను కాపాడేందుకు ప్రయత్నించలేకపోయారని వాపోయారు. దీనిపై బాధితుల ఫిర్యాదుతో తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

మిర్చి యార్డులో కొనుగోలు పున: ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : వేసవి సెలవుల తర్వాత గుంటూరు మిర్చి యార్డులో సోమవారం క్రయ విక్రయాలు పున: ప్రారంభమయ్యాయి. మొత్తం 27,034 టిక్కీలు రాగా 22,873 టిక్కీలు అమ్ముడుపోయి. నాన్ ఎసి కామన్ వెరైటీ కనిష్ట ధర రూ.10 వేలు, గరిష్ట ధర రూ.12,500గా ఉంది. నాన్ ఎసి స్పెషల్ వెరైటీలు తేజ, బాడిగ కనిష్ట ధర రూ.10 వేలు, గరిష్ట ధర రూ.13 వేలు ఉంది. ఎసి వెరైటీల్లోనూ దాదాపుగా ఇవే ధరలున్నాయి.

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో అవార్డులు అందుకున్న విద్యార్థులతో పల్నాడు ఇన్‌ఛార్జి మంత్రి రవికుమార్, రెండు జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు

ప్రతిభ గల విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు

పల్నాడు జిల్లాలో 222 మంది, గుంటూరు జిల్లాలో 150 మందికి ప్రదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా, గుంటూరు

ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, దీనికి నిదర్శనమే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో సత్తా చాటడమని పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల (షైనింగ్ స్టార్స్)ను నరసరావుపేట పట్టణం భువనచంద్ర టౌన్‌హాలులో, గుంటూరు జిల్లా విద్యార్థులకు గుంటూరు నగరంలోని పొన్నూరు రోడ్డులో ఉన్న బి కన్వెషన్ హాలులో సోమవారం ప్రదానం చేశారు. నరసరావుపేటలో ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని ఇతర విద్యార్థులూ చదువులో పోటీ పడాలని సూచించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో 222 మందికి ప్రతిభా పురస్కారాలు అందిస్తుంటే అందులో 129 మంది బాలికలే ఉండటం బాలికల విద్యా స్థాయి మెరుగుదలకు నిదర్శనమన్నారు. బాల్య వివాహాలలో పల్నాడు జిల్లా రాష్ట్రంలోనే 5 స్థానంలో ఉందన్ని, ఈ వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలే మెరుగైన ఫలితాలు సాధించాయని, ఇందులో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి కీలకమని చెప్పారు. పేదరికం విజ్ఞానానికి, ప్రతిభకు అడ్డు కాదని నిరూపించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు మాట్లాడుతూ రానున్న రోజుల్లోనూ బాగా కష్టపడి చదవాలన్నారు. అన్ని వసతులున్న కాలేజీల్లోనే పిల్లల్ని చేర్చాలని తల్లిదండ్రులకు సూచించారు. భవిష్యత్‌లో రాణించడానికి మార్కులే కొలమానం కాదని, 50 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు సైతం పోటీ పరీక్షలలో ప్రతిభ చూపిన సందర్భాలున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ మానసిక విజ్ఞానం, సంకల్పం మెరుగుపడాలన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ఉపాధ్యాయులు శిక్షణివ్వాలన్నారు. జిల్లా విద్యాశాఖ

▶ 2లో

తెనాలి ఘటన మానవ హక్కుల ఉల్లంఘన

(మొదటి పేజీ తరువాయి)

వారిని శిక్షించకూడదని ఎవ్వరూ చెప్పట్లేదని, కానీ అందుకు కోర్టులు ఉండగా, పోలీసులు చట్టాలు చేతుల్లోకి తీసుకోవటం సరికాదని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో పోలీసుల చర్యలు సరికాదన్నారు. ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు ఈ ఘటన నిదర్శనమన్నారు. డిబిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వమూ దళిత, మైనార్టీలపై దాడులకు పాల్పడుతోం దన్నారు. గంజాయి వ్యాపారంలో ప్రధానంగా రాజకీయ నాయకులు, పోలీసుల పాత్ర ఉందని, వారికి వాటా సక్రమంగా రాకపోవటంతో పోలీసుల ప్రతి చర్యలే తెనాలిలో ఘటనకు మూలమని చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకే పోలీసులు యువకుల్ని కొట్టారని, తెనాలి పోలీసులతోపాటు, ఎస్పీపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సుప్రీంకోర్టు న్యాయవాది పొత్తూరి సురేష్ మాట్లాడుతూ మేం ఏం చేసినా ప్రజలు ఏమీ చేయరు అని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా ఉందన్నారు. నేరాలుంటే కొట్టొచ్చు అంటే...చట్టాలను ఉల్లంఘిస్తున్న వారిని, కేసులున్న రాజకీయ నాయకుల్ని ఎవరు కొట్టాలని ప్రశ్నించారు. ఇటువంటి ఘటనలను సమర్థిస్తే భవిష్యత్‌లో అందరిపైనా ఇదే విధంగా వ్యవహరిస్తారని అన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశంలో రాజ్యాంగం, చట్టం, పౌరుల హక్కుల గురించి స్పష్టంగా రాసుకున్నామన్నారు. వాటిని ఏమాత్రం పట్టించుకోండా వందల ఏళ్ల నాటి ఆటవిక రాజ్యానికి పోలీసులు ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారన్నారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పెద్దఎత్తున ఉద్యమించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ ఈ ఘటనపై అవాస్తవ ప్రచారం జరుగుతోందన్నారు. యువకులు కానిస్టేబుల్‌పై దాడి చేశారని చెబుతున్నారని, కానీ సదరు కానిస్టేబుల్ వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయకుండా ఇంటికి వెళ్లాడని, నలుగురిపై ఫిర్యాదు ఉంటే ముగ్గురినే అరెస్ట్ చేశారని, ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు కూడా పలు అనుమానాలకు తావిస్తున్నాయని అనుమానం వెలిబుచ్చారు. ఇవన్నీ వెలుగులోకి రావాలంటే విచారణ జరపాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ తెనాలి పోలీసు మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని చూస్తోందన్నారు. సిఫార్సు లేఖలతో ఎమ్మెల్యేలు వారికి నచ్చిన పోలీసు అధికారుల్ని నియమించుకుంటున్నారని, వారు స్థానిక ఎమ్మెల్యేల కనుసన్నల్లో పనిచేస్తూ చట్టాన్ని చేతుల్లో తీసుకుంటున్నారని అన్నారు. గంజాయి, పేకాట, అక్రమ మద్యం వంటి వ్యాపారాల్లో పోలీసులు వారం వారం మామూళ్లు వసూలు చేస్తున్నారన్నారు. ఐలా రాష్ట్ర నాయకులు జి.శాంతకుమార్ మాట్లాడుతూ ఇటువంటి మానవ హక్కుల ఘటనపై ప్రతి ఒక్కరూ నోరు విప్పాలన్నారు. ఇటీవల పొన్నూరులో థర్డ్ డిగ్రీ విషయంలో, ఇప్పుడు తెనాలి ఘటనలో ఎస్పీ పోలీసు చర్యలు సమర్థించటం దారుణం అన్నారు. సమావేశంలో ప్రముఖ న్యాయవాది వై.కోటేశ్వరరావు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ నాయకులు ప్రభాకర్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టీ, బిఎస్‌పి నాయకులు వాసు, న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు వి.నరసింహారావు, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఇ.అప్పారావు, వివిధ సంఘాల నాయుకులు సురేష్, ఎన్. నీలాంబరం, రామాంజనేయులు, జె.శ్రీనివాసరావు, చంద్రానా యక్, వి.సదాశివరావు, బి.వీరాస్వామి, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక నల్లపాడు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటూరుకు చెందిన మహిళ దుర్మరణం పాల య్యారు. పోలీసుల కథనం ప్రకారం గుంటూరు స్తంభాల గరువుకు చెందిన ఎం.కోటేశ్వరమ్మ (60) దిచక్రవాహనంపై వెళ్తూ ఉండగా రోడ్డు క్రాస్ చేస్తుండగా నల్లపాడు అమ్మవారి దేవాల యం వద్ద పేరేచర్ల నుంచి గుంటూరుకు వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. లారీని నిలిపివేసి డ్రైవర్ పోవడానికి ప్రయత్నించగా పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ వైద్యశా లకు తరలించారు. నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు

(మొదటి పేజీ తరువాయి)

అధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ ప్రతి మండలం నుండి ఒసి-2, బిసి-2, ఎస్‌సి-1, ఎస్‌టి-1 మొత్తం ఆరుగుర్ని ఎంపిక చేశామని, 10వ తరగతి నుండి 185 మంది, ఇంటర్ నుండి 37 మందికి పురస్కారాలు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎపి శిల్పారామ, ఆర్ట్స్ - సాంస్కృతిక సంస్థ చైర్మన్ చేరెడ్డి మంజులారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఆర్డీవో కె.మధులత, ఎఎంసి చైర్మన్ పి.శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.సుబ్బరాయగుప్త పాల్గొన్నారు. టీచర్ బాలరాజు పాటలు, సుమశ్రీ హంసా వైష్ణవి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో 150 మంది విద్యార్థులకు అవార్డులను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్‌అహ్మద్, స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్‌జెడి బి.లింగేశ్వరరెడ్డి, డిఇఒ సివి రేణుక, జిఎంసి డిప్యూటీ మేయర్ సజీలా ప్రదానం చేశారు. రూ.20 వేలు, ప్రశంసా పత్రం, మెడల్‌ను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతిలో 112 మంది, ఇంటర్‌లో 38 మంది మొత్తం 150 మంది షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి

రంగంలో పోటీ నెలకొందని, మన ఆలోచనా విధానం మారాలని అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఏమి అవుతారో కనుక్కుని అందుకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువుపై ఖర్చు పెట్టిన ఒక్క రూపాయి కూడా వ్యర్థం కాదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ కె.వెంకటరెడ్డి, డిసిఇబి సెక్రెటరీ తిరుమలేశ్, సమగ్ర శిక్ష ఏపీడీ పద్మావతి, గుంటూరు, తెనాలి డిప్యూటీ డిఈఓలో ఏసురత్నం, నిర్మల కుమారి పాల్గొన్నారు.

12 వెలగపూడిలో 'సుపరిపాలన - స్వర్ణాంధ్ర' సభ

హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామంలో రాష్ట్ర సచివాలయం సమీపంలో ఈ నెల 12న 'సుపరిపాలన -స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పాల్గొంటారని అధికారులు తెలిపారు. సోమ వారం వెలగపూడిలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి , జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ పరిశీ లించారు. అధికారులకు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఏర్పాట్లపై తగు సూచనలు చేశారు. నిర్దేశించిన మేరకు అధికారులు ఏర్పా ట్లను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, గుంటూరు ఆర్డీవో శ్రీని వాసరావు, డిఎస్పీ మురళి కృష్ణ, తుళ్లూరు మండల తహశీల్దార్ సుజాత, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్, భారతి క్షమాపణలు చెప్పాలి : జెఎసి

కృష్ణంరాజు, కొమ్మినేని దిష్టిబొమ్మలు దహనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సాక్షి ఛానల్ డిబేట్‌లో కొమ్మినేని వివిడి కష్ణంరాజు రాజధాని మహిళలపై చేసిన అనుచిత వ్యక్తులకు నిరసనగా మంగళగిరి తెనాలి రోడ్డులో గల సాక్షి ప్రింట్ మీడియా భవనాన్ని అమరావతి జేఏసీ నాయకులు మహిళలు సోమవారం ముట్టడించారు. భారీ సంఖ్యలో హాజరైన అమరావతి మహిళలు, రైతులు, జేఏసీ నాయకులు సాక్షి యాజమాన్యం వెంటనే క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడి 80 గంటలవుతున్న సాక్షి యాజమాన్యానికి ఎలాంటి చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సాక్షి ఛానల్ యాజమాన్యం వైయస్ భారతి వైయస్ జగన్మోహన్ రెడ్డి క్షమాపణ చెప్పే వరకు ఆందోళన చేస్తామని, క్షమాపణ చెప్పని పక్షంలో నిరసనలు ఉదతం చేస్తామని అమరావతి జేఏసీ మహిళలు హెచ్చరించారు. కష్ణంరాజు మహిళలను వేశ్యలతో పోలిస్తే సజ్జల రామకష్ణారెడ్డి సమర్థిస్తూ పిచ్చికూతలు కూస్తున్నారని జేఏసీ మహిళలు, ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావు, కష్ణంరాజు దిష్టిబొమ్మలను సాక్షి కార్యాలయం ఎదుట దహనం చేశారు. 1600 రోజులు రాజధాని అమరావతి కోసం ఉద్యమం చేసిన మహిళలను కించపరిచిన కేఎస్ఆర్ కష్ణంరాజు వెంటనే మోకాళ్లపై నిలబడి క్షమాపణ చెప్పే వరకు విడబోమని అన్నారు. సాక్షి కార్యలయం ఎదుట బైఠాయించిన జేఏసీ మహిళలు, నేతలు చెప్పులతో చీపుర్లతో నిరసన చేస్తూ గేటు ఎక్కే ప్రయత్నం చేశారు. సాక్షి కార్యలయం ఎదురుగా భారీ సంఖ్యలో చేరుకున్న అమరావతి

సాక్షి కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న జెఎసి నాయకులు

జేఏసీ మహిళలు నాయకులు ఒక్కసారిగా లోనికి వెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు అడ్డుకొని వారి ప్రయత్నాన్ని విఫలం చేశారు. వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ సమయంలో స్వల్ప ఘర్షణ వాతావరణ చోటు చేసుకుంది. అమరావతి జేఏసీ మహిళలు సాక్షి కార్యలయం బోర్డును తొలగించారు. అనంతరం కార్యలయం పైకి రాళ్ళు వేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. రాజధాని, రాజధాని ప్రాంతంలోని ఉన్న మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారికి ఖచ్చితంగా తగిన రీతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆకుల జయసత్య, జెఎసి నాయకులు మైనర్ బాబు, రంగిశెట్టి పెద్దబ్బాయి, పలువురు రాజధాని ప్రాంత దళిత నేతలు మహిళలు పాల్గొన్నారు.

రాజధాని, మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : ధూళిపాళ్ల

ప్రజాశక్తి - పొన్నూరు

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సాక్షి ఛానల్ లైవ్ డిబేట్ లో మాట్లాడిన జర్నలిస్టు అని చెప్పుకునే వి వి ఆర్ కృష్ణంరాజు ,కొమ్మినేని శ్రీనివాస రావు సాక్షి టీవీ యాజమాన్యం పై కఠిన చర్యలు తీసు కోవాలని కోరుతూ పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో పొన్నూరు పట్టణంలోని ఐలాండ్ సెంటర్ వద్ద సోమవారం ధర్నా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాక్షి దినపత్రికలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర మాట్లాడుతూ ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చి 11 స్థానాలకు పరిమితం చేసి ప్రతిపక్ష హోదా లేకుండా చేసిన జగన్ లో ఇప్పటికీ అహంకారం తగ్గలేదని విమర్శించారు. రాష్ట్రంలోని మహిళలను కించపరిచే అసభ్యకర వాఖ్యలను సభ్యసమాజం ఖండిస్తుందని ఆయన పేర్కొన్నారు. సాక్షి సంస్థలు ఇప్పటికైనా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేకపోతే వారిని మహిళలు తగిన విధంగా సత్కరిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మహిళలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ఏపీ రాజధాని అమరావతి ప్రాంత మహిళలను కించపరిచేలా మాట్లాడిన సాక్షి టీవీ విశ్లేషకుడు కొమ్మినేని, పరారీలో ఉన్న కృష్ణారెడ్డి తోపాటు సాక్షి యాజమాన్యంపై కూడా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ మాచర్ల ఏరియా సెక్రెటరీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగా సాక్షి టీవీలో రాజధాని మహిళలను కించపరుస్తూ వేశ్యల రాజధాని అని వర్ణించటం దుర్మార్గమన్నారు. వైసిపి సీనియర్ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి జరిగిన తప్పు పై ఖండించాల్సింది అర్థం లేకుండా మాట్లాడుతున్నడని విమర్శించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రజాశక్తి ప్రత్తిపాడు : అమరావతి రాజధాని పై అసభ్య పదజాలం వాడిన వారిపై సాక్షి చానల్ పై చర్యలు తీసుకోవాలని తెలుగు దేశం పార్టీ నాయకులు ఆ పార్టీ కార్యాలం నుండి పాదయాత్రగా బయలు దేరి వాసు కాంప్లెక్స్ వద్ద సాక్షి పత్రికను మహిళలు నిప్పు పెట్టి కాల్చి వేసారు. అనంతరం పోలీస్టేషన్ వెళ్ళి పిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి తహసీల్దార్ జి కరుణ కుమార్ కి మోమారండం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గింజుపల్లి శివ రామ్ ప్రసాద్ , నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలుచేసిన జర్నలిస్టులు వివిఆర్ కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు లపై తెనాలి టిడిపి మహిళలు తీవ్రంగా మండిపడ్డారు. తెనాలి టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహిళ కార్యకర్తలు నిమ్మకాయల రమ్య, యనమల అనిత, గుమ్మడి భావన మాట్లాడారు. రాజధాని అమరావతి సాధనకు అహర్నిశలు కష్టపడిన మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజును వెంటనే అరెస్ట్ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల లైవ్ డిబేట్ ద్వారా సాక్షి చానల్లో మాట్లాడించిన సాక్షి టీవీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళ కార్యకర్తలు దివి అనిత, వాసి రెడ్డి సులోచన, లీలా, సీతారత్నంతదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రెవ. డా. విలియం కేరి (ఆధునిక ప్రేశిత ఉద్యమ పితా మహుడు- (ఫాదర్ ఆఫ్ మిషన్)191 వ జ్ఞాపకార్ధం సంద ర్భంగా రెవ. డా. విలియం కేరి మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు సోమవారం పంపిణి చేశారు. అనంతరం రక్తదాన కార్య క్రమం నిర్వహించారు. సబ్ జైల్లో ఖైదీలకు పండ్లు, బ్రెడ్స్ పంపిణి చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు బంకా బాబు రావు, కార్యదర్శి గుజ్జర్లపూడి భానుప్రకాష్, కోశాధికారి గుజ్జర్ల పూడి మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి యోహాను, ఉప కోశాధికారి నేలపాటి కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు గుజ్జర్లపూడి కపాదానం పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

లాడ్జీల్లో తనిఖీ

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు పట్టణ అర్బన్ సీఐ వీరానాయక్ ఆధ్వర్యంలో పొన్నూరు టౌన్‌లో లాడ్జిలను సోమవారం అకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ లాడ్జి నిర్వాహలకు పలు సూచనలు ఇచ్చారు. లాడ్జికి వచ్చేవారి ఆధార్ కార్డులు, ఐడెంటిటీ ప్రూఫ్ తీసుకొని గది ఇవ్వాలన్నారు. సదరు వివరాలు రిజిస్టర్‌లో పూర్తిగా రాయాలని, ఎలాంటి ఐడి ప్రూఫ్ లేని వారికి గదులు ఇవ్వకూడదని, లాడ్జిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినట్లు సమా చారం వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.

ల్యాండ్ పత్రాలు పోయినవి

దూదేకుల కమాల్ సాహెబ్, తండ్రి ఖాసీం సాహెబ్ కరాలపాడు అను నా యొక్క ల్యాండ్ డాక్యుమెంట్ నెంబర్ 1060/1985 పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వారిచే రిజిస్టర్ కాబడిన ల్యాండ్ పత్రాలు ది. 09-06-2025న పిడుగురాళ్ల పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పోయినవి. కావున మీకు ఎవరికైనా సదరు ల్యాండ్ డాక్యుమెంట్ నెంబర్ 1060/1985 పత్రాలు దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెం. 7382404961 ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.

దావా సమను

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు, సత్తెనపల్లి.

ఓ.ఎస్.నెం. 617/2022

బిట్వీన్ :

తొట్టెంపూడి హనవాయమ్మ -- వాది

మరియు

సోమేపల్లి నరసింహారావు -- ప్రతివాది

టు,

సోమేపల్లి నరసింహారావు, తండ్రి పున్నయ్య, నివాసం డోర్ నెం. 15-10-11, వడ్డపల్లి, సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీపై ప్రామిసరీ నోటు బాకీ నిమిత్తం దావా దాఖలు చేయగా మీకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను సమన్లు పంపియున్నారు. మీరు సమన్లు తీసుకొన కుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 17-06-2025న వాయిదా వేసియున్నారు. ఆరోజున మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగా యిందు మూలంగా తెలియజేయడమైనది. లేనిచో మీపై పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : 17/6/2025

సత్తెనపల్లి

ఇట్లు

పి.వి. నరసింహశాస్త్రి, అడ్వకేట్,

సత్తెనపల్లి.

అవార్డు అందుకున్న పెద్దకూరపాడు మండల విద్యార్థులు

అవార్డు అందుకున్న నాదెండ్ల మండల విద్యార్థులతో ఎంఈఓ

షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్న పలువురు విద్యార్థులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

విద్యా విహార్ హైస్కూల్‌లో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు 587 సాధించిన వెదుళ్లపల్లి వెంకట శివ కుమార్ నరసరావుపేటలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డును ఎంపి కష్ణదేవరాయలు, కలెక్టర్ అరుణ కుమార్ చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. ఈ సందర్భంగా షైనింగ్‌స్టార్ అవార్డు సర్టిఫికెట్, మెడల్, రూ.20వేల చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా విజయ విద్యావిహార్ హైస్కూల్ యాజమాన్యాన్ని, ప్రధానోపాధ్యాయులు నోముల కోటేశ్వం రావుకు కలెక్టర్, ఎంపి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మండలంలోని వివేకానంద విద్యా నికేతన్ హైస్కూల్ విద్యార్థి సిమ్మిశెట్టి సుమశ్రీ 591మార్కులు, సెయింట్ ఆన్స్ హై స్కూల్ చెందిన విద్యార్థులు చెందిన చేగు వెంకట అశ్రిత 589 మార్కులు, గుంటూరు అమూల్యకు 569 మార్కులు, చైతన్య పబ్లిక్ స్కూల్‌కు చెందిన సింగమనేని హిమని 585 మార్కులు, పులి సంతోష్ పాల్ 584 మార్కులు సాధించిన వారు కూడా రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిని పెదకూరపాడు మండల విద్యాశాఖ అధికారి ఏకుల ప్రసాదరావు, విద్యాశాఖ అధికారి 2 తాడిశెట్టి సత్య నారాయణ, ప్రజాకవి దర్శిశేషారావు అభినందించారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

పదవ తరగతిలో మండలంలో అత్యున్నత మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పేరిట ప్రభుత్వం సోమవారం అందజేసిన అవార్డులకు నాదెండ్ల మండలం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిరు మామిళ్లకు చెందిన పిట్టల విజయలక్ష్మి 591, ఈతరం హైస్కూల్ సాతులూరుకు చెందిన షేక్ షహీరా 588, ఈతరం హై స్కూల్ సాతులూరుకి చెందిన కిలారుతిరుమల భువనశ్రీ 583, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తూబాడుకు చెందిన ప్రతిపాటి అమూల్య 593 ఏపీ మోడల్ స్కూల్ చిరు మామిళ్లకు చెందిన మెగావత్ జయశ్రీ 583, జిల్లా పరి షత్ పాఠశాల గణపవరానికి చెందిన మాలింపాటి నాగసతీష్ కుమార్ 575 మార్కులు ఎంపికయ్యారు. నరసరావుపేట భువనచంద్రటౌన్ హాలులో జరిగిన కార్యక్రమంలో వీరిని ప్రభుత్వం తరపున సన్మానించారు.ఎంఈఓ ఏమని కృష్ణారెడ్డి తెలిపారు. నరసరావు పేట ఎంపీ లావు కష్ణదేవరాయలు విద్యార్థినీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

క్రమశిక్షణ, అంకితభావం, ఇష్టపడి కష్టపడి విద్యనభ్యసించి నట్లయితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంపి లావు శ్రీకష్ణదేవరాయలు, కలెక్టర్ అరుణబాబులు సూచించారు. సోమవారం రెంటచింతల మండలానికి చెందిన ఏడుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులను పంపిణీ చేయడంతో పాటు ఒక్కొక్కరికి 20వేల రూపాయల నగదును పంపిణీ చేశారు 2024-25 సంవత్సరానికి సంబంధించి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఫాతిమా విద్యా నికేతనకు చెందిన బి. గీత అఖిల్ రెడ్డి (593) మార్కులు ఎం. మల్లికార్జున నాయక్ (592) మార్కులు సన్నగంటి లాస్య (590)బుగ్గవరపు సువర్ణ లక్ష్మి (589) ఆల్ ఫోర్స్ స్కూలుకు చెందిన చింతమల్ల శశాంక్ (593) వివేకా పబ్లిక్ స్కూల్ విద్యార్థి షేక్ యాసిన్ (590) బాల వికాస స్కూల్ విద్యార్థిని రాయ అనుష్క(589) మార్కులు ఉన్నారు ఈ కార్యక్రమంలో శిల్పారామం చైర్మన్ చే రెడ్డి మంజుల రెడ్డి డీఈవో జి.సంధ్యా రాణి ఎంఈఓ శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

16 రకాల అభివృద్ధి పనులను పూర్తి చేశాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి చేబ్రోలు

మండలంలోని సుద్దపల్లి గ్రామంలో రూ.104.38 లక్షలు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సోమవారం గ్రామ సచివాలయం నూతన భవనంతో పాటు, 135 మీటర్ల సిమెంట్ రోడ్లు ఆయన ప్రారంభించారు. 110 మీటర్ల సిమెంట్ రోడ్డు, 110 మీటర్ల సిసి డ్రైన్లు, మంచి నీటి రెండు బోర్లు ,ప్రభుత్వ ఉన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఆయన గ్రామలోని అన్ని ప్రధాన వీధులలో పర్యటిస్తూ ప్రజల అవసరాలు, సమస్యలు తెలుసుకుంటూ కలయతిరిగారు. అనంతరం సచివాలయం దగ్గర ఏర్పాటు చేసిన సభలో ధూళి పాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రామంలో 16 రకాల అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. నూతనంగా అప్ గ్రేడ్ చేసిన హైస్కూలుకు అదనపు తరగతి గదులను నిర్మించేందుకు శంకుస్థాపన చేసిన ఆయన గ్రామంలో అదనపు గదుల నిర్మాణం కొరకు ముందుకు వచ్చిన దాతలను పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్నందుకు ఆయన అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారిశెటీ గోవిందమ్మ , మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి ఊహారాణి , తహసిల్దార్ కే శ్రీనివాస్ శర్మ పిఆర్ఏఈ ఎస్.కె ఫిరోజ్ లాల్ , హౌసింగ్ ఏఈ ఐ ఓబుల్ రెడ్డి , ఏపీఎం శ్రీలక్ష్మి , పంచాయతీ కార్యదర్శి జి శ్రీనివాసరావు , తెలుగుదేశం - జనసేన - బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడులు విద్యుత్ శాఖ విజితలెన్స్ విభాగం సిపి సర్కిల్ ఆపరేషన్ విభాగ, పర్యవేక్షక ఇంజనీర్ పి. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సోమవారం తాడికొండ సెక్షన్ మోతడక, ముక్కామల, పొన్నెకల్లు, పెదకంద్రిక, పాములపాడు, ఫనిదరం, రావెల గ్రామాలలో తనిఖీలు చేపట్టారు. 45 బందాలుగా ఏర్పడి 3106 సర్వీసులు తనిఖీ చేసినట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు. తనిఖీలలో సీలు లేకపోవుట, ఉద్దేశ పూర్వకంగా వాటిని తొలగించుట, గాట్లు పెట్టుట వంటివి గమనించిన యెడల విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. మొదటిసారి తప్పిదానికి కాపౌండింగ్ పద్ధతిలో అపరాధ రుసుం చెలిస్తే కేసు నుంచి విడిచి పెడతారన్నారు. రెండవసారి తప్పి దానికి అరెస్టు చేసి రిమాండ్‌కి పంపుతారన్నారు. అపరాధ రుసుము కట్టలేని పరిస్థితులలో రెవెన్యూ రికవరి చట్టం కింద ఆస్తులు జప్తు చేస్తారని తెలిపారు. దాడులలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.పి.ఇ విజిలెన్సు సిహెచ్. వెంకటేశ్వర రావు డిఈఈ ఎన్. మల్లిఖార్జున ప్రసాద్, డిఈఈ కె.వి.కోటేశ్వర రావు, ఏఈ కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్ కుమార్, ఏఈ యు.శివశంకర్, ఆపరేషన్ ఏఈ.ఎన్ నాగమల్లెస్వరరావు, ఆపరేషన్ డిఈ ఈ, ఏఈ లు పాల్గొన్నారు.

శిల్పులను సన్మానిస్తున్న మంత్రి సత్యకుమార్

తెనాలి శిల్పులకు సన్మానం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో నిర్వహించిన ఛత్రపతి శివాజి కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో విగ్రహాన్ని రూపొందించిన కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రను సోమవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జగ్గయ్యపేట శాసనసభ్యులు రామ్‌రాజగోపాల్ సన్మానించారు.కృష్ణా జిల్లా సహకార సెంట్రల్ బ్యాం క్ చైర్మన్ నెట్టెం రఘురామ్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజి శాసన సభ్యులు సామినేని ఉదయభాను, విగ్రహ కమిటి సభ్యులు కాటూరి శిల్పులను అభినందించారు.

డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక ఆర్టీవో కార్యాలయం ప్రక్కనే ఉన్న రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో నెల రోజులుగా ట్రాన్స్ పోర్టు వాహనాల డ్రైవింగ్ శిక్షణ తీసుకున్న వారికి బీజేపీ నాయకులు రంగశెట్టి రామకృష్ణ ఫారం 5 సర్టిఫికెట్‌ను సోమవారం అందజేసినట్లు ఆ సంస్థ మేనేజింగ్ పార్ట్నర్ కనకదుర్గ పద్మజ తెలిపారు. రంగశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ శిక్షణలో ఉన్న డ్రైవర్ స్వతంత్రంగా డ్రైవింగ్ చేయడానికి అనుకూలమైన గ్రౌండ్ ఏర్పాటు చేసిన ఈ రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను రాష్ట్రంలోనే ఒక ఐకానిక్ ట్రైనింగ్ సెంటర్‌గా పేర్కొన వచ్చున్నారు. మేనేజింగ్ పార్ట్నర్ ఆర్ కనకదుర్గ పద్మజ మాట్లాడుతూ మా యొక్క రోడ్ సేఫ్టీ ఎన్జీవో సంస్థకి అనుబంధ సంస్థ అవడం వలన పి.ఫోర్ పథకం కింద డ్రైవింగ్ శిక్షణ తీసుకునే వారికి ఉచితంగా అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.అనంతరం శిక్షణ తీసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ట్రాన్స్ పోర్ట్ వాహనాల ఇన్‌స్పెక్టర్ డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యానాది కుటుంబాలకు ఆధార్ కార్డులు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - పొన్నూరు

యానాది కుటుంబాలకు ఆధార్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పొన్నూరు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు మాట్లాడుతూ పొన్నూరు పట్టణం 16, 25వ వార్డులలో నివసించే యానాది కుటుంబాలకు ఎటువంటి పత్రాలు లేకవారి పిల్లలకు ఆధార్ కార్డులు నమోదు కావడం లేదన్నారు. జీవనోపాధి కోసం వలసలు వెళ్లే యానాది కుటుంబాల పిల్లలకు బర్త్ సర్టిఫికెట్ లేకపోవడం వలన ఆధార్ కార్డు మంజూరు కాక రేషన్ కార్డులో వారి పేర్లు పొందుపరచడం లేదన్నారు. ఎమ్మార్వో, కమిషనర్‌తో మాట్లా డగా సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపడతామని హామీ ఇచ్చా రన్నారు. గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్ పెద్ద బ్రహ్మయ్య వెంకయ్య సీతమ్మ కోటేశ్వరమ్మ అప్పాయమ్మ శారదమ్మ పాల్గొన్నారు.

17 మందికి స్పౌజ్ పింఛన్లు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి రూరల్ పరిధిలో 17 మందికి స్పౌజ్ పెన్షన్లు మంజూరైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అత్తోట దీప్తి తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆమె వివరాలు వెల్లడించారు. అర్హత కలిగిన మహిళలు తమ భర్త మరణ ధ్రువీకరణ పత్రం, వారి సొంత ఆధార్ కార్డుతో సహాసంబంధిత పత్రాలతో గ్రామ సచి వాలయ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి స్టేషన్ రోడ్డు గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన తెనాలిలో చోటుచేసుకుంది. సోమవారం స్థానిక పేటస్టేషన్ రోడ్లో వార్ఫ్ కాల్వకట్టపై మూసి ఉన్న ఓ దుకాణం ఎదుట కండువాతో రాడ్డుకు ఉరి వేసినట్లు కనిపిస్తున్న దశ్యం పలు అనుమానాలకు తావి స్తోం ది. ఈ ఘటనపై స్థానికులు మూడవ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపంచనామాకు తెనాలి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు మూడో పట్టణ ఎస్సై షేక్ కరిముల్లా తెలిపారు.

ఆరు నెలలుగా అందని పింఛను

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఆరు మసాలుగా మాకు పెన్షన్ పంపిణీ చేయడం లేదని ప్రత్తిపాడు మండల పరిధిలోని కొండేపాడు గ్రామానికి చెందిన పచ్చల శ్రీనివాసరావు అనే వ్యక్తి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ఫిర్యాదు చేశారు. పచ్చల శ్రీనివాసరావు వికలాంగుల పెన్షన్ పొందుతున్నారు. ఆరు నెలల నుండి పెన్షన్ పంపిణీ చేయకుండా నేను ఇంటిలో ఉన్నా డోర్ లాక్ అని రాసుకున్నారని బాధితుడు తెలిపారు.ఆరు నెలల నుండి పంపిణీ చేయక పోవడంతో అతని పెన్షన్ పర్మినెంట్‌గా మైగ్రేషన్‌లోకి వెళ్ళిందని ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు తప్పుడు నివేదికలు అందిస్తున్నారని తెలిపారు. ఇదిలా ఉంటే అదే గ్రామంలో జీ.వేణు గోపాల్ ప్రసాద్ పెన్షన్, చుండూరు సాంబ శివరావు కూడా వికలాంగుల పెన్షన్ దారులే కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాకుండానే క్లోజ్ చేస్తున్నారని వాపోయారు.

వ్యాక్సినేషన్‌పై వైద్యాధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వ్యాక్సినేషన్ మార్గదర్శకాలపై వైద్యాధికారులకు నరసరావుపేట పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ బి.రవి ఆధ్వర్యంలో సోమవారం శిక్షణిచ్చారు. మూడ్రోజులపాటు జరగనున్న ఈ శిక్షణలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక హాజరయ్యారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రం, ఏరియా, సామాజిక ఆసుపత్రుల నుండి వచ్చిన 90 మంది వైద్యాధికారులకు వివిధ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ బి.గీతాంజలి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ ఎం.పద్మావతి, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీ హెల్పర్లకు నియామక పత్రాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని అంగన్వాడీ ఆలయాలకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. నూతనంగా నియమితులైన అంగన్వాడీ హెల్పర్స్‌కు నియామక పత్రాలను సత్తెనపల్లి పట్టణంలోని రఘురాం నగర్ టిడిపి ప్రజావేదికలో సోమవారం అందచేశారు. సిడిపిఒ శ్రీలత, మార్కెట్ యార్డు చైర్మన్ కె.శోభారాణి, టిడిపి మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, నాయకులు కె.వెంకటేశ్వరరావు, ఎ.సాంబయ్య, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాహనాలకు రూ.3వేల జరిమానా

ప్రజాశక్తి - యడ్లపాడు

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘలనపై యడ్లపాడు పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న వాహనాలకు రూ.3 వేల జరిమానా విధించారు. ఎస్ఐ టి.శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రయాణికుల ప్రాణాలను లెక్కచేయకుండా నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రత దష్ట్యా ఇటువంటి తనిఖీలు ఇకపై మరింత కఠినంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ.శివరామకృష్ణ

ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి, కలెక్టర్ తదితరులు

స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రణాళికను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో యాక్షన్ ప్లాన్ యూనిట్లను రాష్ట్ర సెక్రటేరియట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎం చంద్రబాబు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, ఎంపి లావు శ్రీకష్ణ దేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జీడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు, ఇతర అధికారులు నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి హాజరయ్యారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ అధికార యంత్రాంగంతో కలిసి వచ్చే మూడేళ్లలో తలసరి ఆదాయం రెట్టింపు చేయడానికి కృషి చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు వేర్వేరు మార్గాల్లో అభివృద్ధికి కృషి చేస్తున్నారని, స్వర్ణాంధ్ర యాక్షన్ ప్లాన్ ద్వారా వారు ఏకీకృత వ్యవస్థ ద్వారా ఒకే లక్ష్యంతో సమగ్ర అభివృద్ధికోసం పని చేస్తారని తెలిపారు. స్వర్ణాంధ్ర యాక్షన్ ప్లాన్ ప్రకారం, జిల్లా స్థాయి యాక్షన్ ప్లాన్ యూనిట్‌కు ఇన్‌ఛార్జి మంత్రి చైర్ పర్సన్‌గా, లోక్‌సభ ఎంపీ వైస్‌చైర్ పర్సన్‌గా, జిల్లా కలెక్టర్ పరిపాలన వైస్ చైర్‌పర్సన్‌గా, సీపీవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారని వివరించారు. లోక్‌సభ, రాజ్య సభ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్ పర్సన్, మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు సభ్యులుగా ఉంటారన్నారు. నియోజకవర్గ స్థాయి యాక్షన్ ప్లాన్ యూనిట్‌కు ఎమ్మెల్యే అధ్యక్షుడిగా, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ పరిపాలన వైస్ చైర్ పర్సన్‌గా, నియోజకవర్గ కేంద్రం ఎంపీడీఓ కన్వీనర్‌గా ఉంటారని, ఎమ్మెల్సీలు, మున్సిపల్ చైర్ పర్సన్లు, సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారని తెలిపారు.

ఉపాధి హామీ పని కోసం ప్రదర్శన

ప్రజాశక్తి - అమరావతి

తమకు ఉపాధి హామీ పనులు చూపాలని మండల కేంద్రమైన అమరావతిలో జగ్జీవన్‌రామ్ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం కాలనీ నుండి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఎపిఒకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ వ్యవసాయ పనులు అయిపోయి నెలదాటిందని, అప్పటి నుండి తమకు ఉపాధి లేక ఇళ్ల వద్దే ఉంటున్నామని చెప్పారు. పనులు చూపాలని ఉపాధి హామీ అధికారులను అడిగితే ఈ ఏడాది లేవని చెప్పడం దారుణమని అన్నారు. ఎపిఒ స్పందిస్తూ త్వరలోనే పనులు చూపుతామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు, ప్రజాసంఘాల నాయకులు సూరిబాబు, కూలీలు డి.వీరమణి, కె.మాధవి, నిర్మల, మునిమ్మ, దేవమ్మ, సరస్వతి, ఆరోగ్యం పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఎంఎం రెడ్డి ఫార్మసీ కాలేజీ, కెసి ఓవర్సీస్ ప్రతినిధులు

ఎంఎం రెడ్డి ఫార్మసీ కాలేజీ - కెసి ఓవర్సీస్ మధ్య అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రపంచవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్య, అడ్మిషన్ ప్రక్రియ, వీసా మార్గదర్శకత, స్కాలర్‌షిప్ వంటి అంశాలపై పూర్తి సహాయం అందించడం కోసం తమ కళాశాలకు, కెసి ఓవర్సీస్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని ఎఎంరెడ్డి స్మారక ఫార్మసీ (ఆటానమస్) కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలోని కళాశాలలో రాతపూర్వక ఒప్పందాలు చేసుకున్నట్లు చెప్పారు. విదేశీ విద్య సేవల రంగంలో ప్రముఖంగా నిలిచిన కెసి ఎడ్యుకేషన్‌తో ఎంఒయు చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు కావలసిన సలహాలు సూచనలు ఈ ఒప్పందం ద్వారా అందుతాయని, తద్వారా విద్యార్థులు తమ లక్ష్యాలను సాకారం చేసుకోవడానికి మంచి వేదికగా నిలుస్తుందని చెప్పారు. ఫార్మసీ విద్యార్థులకు పరిశోధన, ఉన్నతవిద్య, కెరీర్ పరంగా ప్రపంచంలో ఉన్న అవకాశాలను వినియోగించుకోవచ్చన్నారు. దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు విదేశీ విద్యా అవకాశాలను చేరువ చేయాలన్నదే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణరావు, కెసి ఓవర్సీస్ అధినేత రవిచంద్రరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్ స్పందనకు 162 అర్జీలు

ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో జిల్లా కలెక్టర్‌తో పాటు డిఆర్ఒ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించాలన్నారు.

గడువులోగా అన్ని సర్వేలు పూర్తి చేయాలి

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో కలెక్టరేట్‌లో సోమవారం సమావేశమయ్యారు. యోగాంధ్ర యాప్ ద్వారా యోగా దినోత్సవ ఔత్సాహికుల రిజిస్ట్రేషన్లు, 5 నుంచి 15 ఏళ్ల వయసు బాలల ఆధార్ అప్ డేట్ సర్వే, రేషన్ కార్డు ఈకేవైసీలు పూర్తి చేయాలన్నారు. మంగళవారం నాటికి యోగాంధ్ర పార్ట్ 1 సర్వే పూర్తి చేయాలని, అనంతరం పార్ట్-2 సర్వే ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ఆధార్ అప్‌డేట్ సర్వే పూర్తి చేసి విద్యార్థుల ప్రవేశాలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో జెసి సూరజ్ ధనుంజయ్ గనోరే, డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రవి, జిఎస్‌డబ్ల్యుఎస్ నోడల్ అధికారి ఎం.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు పూర్తిస్థాయిలో వచ్చాయి : ఎంఇఒ

ప్రజాశక్తి - మాచర్ల

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 47వేల పాఠ్యపుస్తకాలు మండల విద్యావనరుల కేంద్రానికి చేరినట్లు మండల విద్యాశాఖాధికారి -2 అల్లిసురేష్ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పంపిణీ కేంద్రంలో పుస్తకాలను పాఠశాలలకు ఆయన సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పట్టణ, మండల పరిధిలో 62 ప్రభుత్వ పాఠశాలలు, 8 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయని, 9 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు చెప్పారు. 47 వేల పుస్తకాలు అవసరంకాగా పూర్తిగా అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఉన్నత పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేయటం పూర్తయిందని, ప్రాథమిక పాఠశాలలకు పంపిణీ ప్రారంభించినట్లు చెప్పారు. బ్యాగులు, బూట్లు, యూనీఫాంలు ఇంకా అందాల్సి వుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలు విద్యను అందిస్తూన్నామని, అందుకు ఈ ఏడాది పదోతరగతి పరీక్షల్లో ప్రభుత్వ విద్యార్థులు సాధించిన మార్కులే నిదర్శనమని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు.

పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో సురేష్



తహశీల్దార్‌కు మెమోరాండం అందజేస్తున్న సిపిఎం నాయకులు, కాలనీవాసులతో మాట్లాడుతున్న తహశీల్దార్ పి.కృష్ణకాంత్

ఏడాది దాటుతున్నా వాగ్దానాలను నెరవేర్చని ప్రభుత్వం

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు
- ఇళ్ల పట్టాలు ఇవ్వాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పెదకాకాని

ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను సంవత్సరం గుడుస్తున్నా నెరవేర్చలేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. ఎన్నో దశాబ్దాలుగా మండల పరిధిలోని ప్రభుత్వ భూములలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సోమవారం పెదకాకాని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని, ప్రభుత్వ భూముల్లో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న వారికి పట్టాలిస్తామని, గ్రామాల్లో ఉండే ప్రజలకు మూడు సెంట్లు, పట్టణాల్లో ఉండే వారికి రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికలలో వాగ్దానాలు చేశారన్నారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదన్నారు. పెదకాకాని మండలం లోని సుందరయ్య కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, స్వర్ణపురి కాలనీ, ఎస్టీ కాలనీ, జాన్ హాస్పర్ కాలనీ వడ్డెర కాలనీలలోని ప్రజలు 20 సంవత్సరాలుగా 2000 మందికి పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వెంటనే వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు మండలంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 5000 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు లేవని వారికి వెంటనే పట్టాలు ఇచ్చి ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు వివాదాలు లేని భూములలో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు. ఇళ్ల పట్టాల సమస్యలు పరిష్కారంతోపాటు పలు కాలనీలలో మౌలిక సదుపాయాలు లేవని వాటిపై దృష్టి సారించి వెంటనే డ్రైనేజీ, రోడ్లు, అంగన్వాడి భవనాలు నిర్మించాలన్నారు. అనంతరం తహశీల్దార్ పి.కృష్ణకాంత్‌కు మెమోరాండం అందజేశారు. తహశీల్దార్ ఆందోళనలో పాల్గొన్న ప్రజలతో మట్లాడారు. అర్హులందరకీ సాధ్యమైనంత త్వరలో ఇండ్లపట్టాలను అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజా రమేష్, బురదగుంట సాంబయ్య, సంకూరి నీలాంబరం, ఉల్లంఘుల శివయ్య, కె.సత్యనారాయణ బి.బాబురావు వివిధ కాలనీలా వాసులు షేక్ హసీనా, దోసర మల్లేశ్వరి, తాత హైమావతి, ఎ.నాగేశ్వరావు ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు.

ప్లాంట్‌ను సందర్శించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్‌కుమార్

జిందాల్ ప్లాంట్‌ను సందర్శించిన సురేష్ కుమార్

ప్రజాశక్తి - గుంటూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ని సందర్శించనున్న తరుణంలో సోమవారం మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, సిడిఎంఏ డాక్టర్ సంపత్ కుమార్, గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్లాంట్‌ని పరిశీలించారు. ప్లాంట్ సామర్థ్యం, పనితీరు, అవసరమైన వ్యర్థాలు, ఏ మున్సిపాల్టీల నుండి ఎంత చెత్త వస్తుంది, ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది తదితర వివరాలను జిందాల్ ఏపి ప్రాజెక్ట్స్ ప్రెసిడెంట్ ఎం.వి.చారి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సిఎం పర్యటనకు ప్లాంట్ కెపాసిటి, ప్రస్తుతం వస్తున్న వ్యర్థాలు, పంపుతున్న మునిసిపాలిటీలు, రోజువారీ విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, వ్యర్థాల నిర్వహణ వంటి సమగ్ర వివరాలతో డాక్యుమెంట్ సిద్ధం చేయాలన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఉపా సెల్ పిఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెదనందిపాడు

పొగాకు పంట కొనక అప్పులపాలై ఆత్మహత్య చేసుకుని చనిపోయిన పుసులూరి వాసి శివశంకర్ వరప్రసాద్ (45) కుటుంబానికి 10 లక్షల ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పుసులూరు గ్రామంలోని మృతుని కుటుంబీకులను కలసి పరామర్శించి, ఆత్మహత్యకు దారితీసిన కారణాలను రమేష్ బాబు బృందం అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో 7 ఎకరాలు పొగాకు, 4 ఎకరాలు ప్రత్తి వేశామని, 4 ఎకరాలు ప్రత్తి పంట పండకపోవడంతో పంట చేను దున్ని ఆ 4 ఎకరాలు, పొగాకు పంట వేసినట్లు మృతుని సోదరుడు వెంకట శ్రీనివాసరావు తెలిపారన్నారు. కౌలు పొలానికి బ్యాంకులో రుణం దొరక్కపోవడంతో గుంటూరు శ్రీరాం ఫైనాన్స్‌లో మూడు లక్షలు లోను తీసుకున్నామని, నెలకు 9 వేలు కడుతున్నామని తెలిపారు. ఇప్పటికి 8 నెలలు చెల్లించినట్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొగాకు పాడైపోయిందని, పండిన పంటను కొనే నాథుడు లేక అప్పు తీర్చలేక దిక్కు తోచని స్తితిలో ఉన్నామని అన్నారు. శివశంకర్ వరప్రసాద్ కుటుంబానికి 10 లక్షల ఆర్థిక సహాయంతో పాటు ఇంటి స్తలం ఇచ్చి, ఆదుకోవాలని రమేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. పరామర్శించిన వారిలో కౌలు రైతు సంఘం మండల నాయకులు నల్లమోతు రాజేంద్ర, రైతు సంఘం మండల నాయకులు జంపని రామారావు ఉన్నారు.

మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

రూ.10లక్షలు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - గుంటూరు

పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు చెందిన పొగాకు రైతు కావూరి శివశంకర వరప్రసాద్‌కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వం స్పందించి వారి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు బి.రామకృష్ణ, కె.నాగమల్లె శ్వరరావు, జిల్లా సహయ కార్యదర్శి పాశం రామారావులు ఒక ప్రకటలో కోరారు. శివశంకర వర ప్రసాద్ 11 ఎకరాలు పోగాకు సాగుచేశారని, ఇంత వరకు పోగాకు కొనుగోలు చేయక, అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే పొగాకు కొనగోలు చేయాలని, మతిని కుటుంబానికి 10లక్షలు పరిహారం చెల్లించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - మంగళగిరి

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఎపి రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన తహశీల్దార్ దినేష్ రాఘవేంద్రరరావు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్యలు మాట్లాడారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతు సంఘం నాయకులు జవ్వాది సాంబశివరావు, ఆళ్ల రామిరెడ్డి, నాసరయ్య, నరేంద్ర, అందజేశారు.

వి.జె. జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రతిభా పురస్కారాలలో భాగంగా ఇంటర్మీడియట్ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లాల వారీగా ప్రకటించే ప్రతిభ పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించిందని విజె విద్యాసంస్థల కరస్పాండెంట్, సెక్రటరీ పి .రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రతిభా పురస్కారానికి మంగళగిరిలోని వి.జె. జూనియర్ కళాశాలకు చెందిన బియ్యపు ప్రవల్లిక సిఇసిలో 963/1000, గుర్రం రమ్య హెచ్ ఇ సి లో 959/1000లను ఎంపిక చేశారని తెలిపారు. గుంటూరు తూర్పు శాసనసభ్యులు నజీర్ అహ్మద్, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థినులు ప్రతిభా పురస్కారాన్ని స్వీకరించారు. ఇంటర్ ఎంపీసీ విభాగంలో 987/1000 ఆదివారం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాలలో 4772 ర్యాంక్ సాధించిన చిరంజీవి జొన్నాదుల వెంకట నాగ అమృత రాజధానిలోని ప్రముఖ యూనివర్సిటీ లలో ఫ్రీ సీటు పొందే అవకాశాన్ని ఉందని తెలిపారు. విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్ అవ్వారు సత్యన్నారాయణ, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాదెళ్ల శ్రీనివాసరావు అభినందించారు.

పురస్కారాలు అందుకున్న విద్యార్థినులు

సెయింట్ పాల్స్ విద్యార్థినికి షైనింగ్ స్టార్ పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి

ఇంటర్లో సత్తా చాటిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న షైనింగ్ స్టార్స్ ప్రతిభ పురస్కారాన్ని పట్టణానికి చెందిన సెయింట్ పాల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థిని దేవరకొండ హెవీమా దక్కించుకుంది. షైనింగ్ స్టార్స్ ఇన్ ఇంటర్మీడియట్ 2025 ప్రతిభ అవార్డు బహూకరణను సోమవారం గుంటూరులోని బి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పురస్కారాలను అందించారు. అవార్డు కింద రూ.20,000/- నగదు, ప్రశంసా పత్రం, మెడల్‌ను విద్యార్థులకు బహూకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఎ. లింకన్ బాబు, కళాశాల కరెస్పాండంట్ షీలా సుజని, అధ్యాపకులు డాక్టర్ స్వేచ్ఛ, కీర్తి అబ్రహం, ఉష, సురేష్ విద్యార్థులను అభినందించారు.

పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నజీర్ అహ్మద్

కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న మహమ్మద్ షన్ను

దీప్తి ఒకేషనల్ విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండల పరిధిలోని యనమదల గ్రామం లోని సాయి దీప్తి ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని మహమ్మద్ షన్ను షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ పేరిట అవార్డులు ప్రధానం చేయుచున్నారు, కళాశాలకు చెందిన మహమ్మద్ షన్ను 940 మార్కులు సాధించి అవార్డుకు ఎంపిక కావడం జరిగింది. సోమవారం గుంటూరులో కలెక్టర్ నాగలక్ష్మి మరియు తూర్పుఎమ్మెల్యే నజీర్ అహ్మద్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. ఎంపికైన విద్యార్థిని షన్నును కళాశాల కరస్పాండెంట్ బచ్చు శ్రీనివాసరావు, డైరెక్టర్ బచ్చు కిరణ్ కుమార్, ప్రిన్సిపల్ మనోహర్‌బాబు, ఇంచార్జ్ సయ్యద్ హామద్ భాషా, అగ్రికల్చర్ ప్రిన్సిపాల్ అమఅత గాయత్రి, కళాశాల సిబ్బంది ప్రవీణ్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మొహమ్మద్ షన్నును అభినందించారు.

మహమ్మద్ షన్నుని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నేడు ఏపీ ఎడ్‌సెట్ కీ విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సులో ప్రవేశానికి ఈనెల 5న నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్-2025 ప్రవేశ పరీక్షకు సంబంధించిన "కీ"ని మంగళవారం విడుదల చేస్తున్నట్లు ఏపీ ఎడ్ సెట్ కన్వీనర్ ఆచార్య ఏవీఎస్ స్వామి సోమవారం తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 87 ఆన్లైన్ పరీక్షా కేంద్రాలలో జరిగిన ఈ ప్రవేశ పరీక్షకు 17,795 మంది దరఖాస్తు చేసుకోగా, 14,612 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు.తాము విడుదల చేసిన "కీ" పైన విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే ఈనెల 13వ తేదీలోగా సందేహాలను పంపాలని ఆయన సూచించారు.ఏపీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలను ఈనెల 21న విడుదల చేస్తామని స్వామి పేర్కొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

యోగా ఆవశ్యకతను వివరిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సోమవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట పల్నాడు బస్టాండ్, పెదచెరువు రోడ్డులో రెవిన్యూ శాఖ, సర్వే - ల్యాండ్ రికార్డ్స్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద చెరువు యోగా స్ట్రీట్‌లో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ అనంతరం అక్కడ నుం చి గడియారం స్తంభం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ యోగ ఆసనాల వల్ల మానసిక ప్రశాంతత, కొన్ని శారీరక రుగ్మతల నుండి ఉపశమనం పొందవచ్చున్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా నేర్చుకొన్న ఆసనాలను ప్రతి రోజూ కొంత సమయం కేటాయించి సాధన చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా రెవిన్యూ అధికారి మురళి, రెవిన్యూ డివిజినల్ అధికారులు మాధవీలత, మురళి కృష్ణ, రమాకాంత్ రెడ్డి, జిల్లా సర్వ్ అండ్ లయాండ్ రికార్డ్స్ అధికారి మధు కీర్తి, తహశీల్దార్ కె.వేణుగోపాలరావు, వివిద శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

వర్చువల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

175 నియోజకవర్గాల్లో స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయాలు వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ సోమవారం పాల్గొ న్నారు.తహసీల్దార్ కార్యాలయంలో సత్తెనపల్లి నియోజకవర్గ స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయ వర్చువల్ ప్రారంభోత్సవంలో ప్రభుత్వ అధికారులతో కలిసి ఎమ్మెల్యే, ఆర్డీవో జీ.రమణ కాంతరెడ్డి తహశీల్దార్ చక్రవర్తి రాజుపాలెం తహశీల్దార్ దుర్గేష్ ఎంపిడిఓ బండి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

భూ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు

తహల్దార్ మహమ్మద్ హుస్సేన్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండలంలోని మురికిపూడి గ్రామ పరిధిలో వాగు పోరంబోకు అసైన్డ్ భూములు క్రయ విక్రయాలు జరిపి అన్యాక్రాంతానికి యత్నించిన, ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్ చెప్పారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మురికిపూడి గ్రామంలోని బొటు వీరాంజనేయస్వామి గుడి వెనుక కొండ పక్కనే ఉన్న సర్వే నంబర్ 33-1-జెడ్11లో128.72 ఎకరాల వాగు పోరంబాకు స్థలం ఉందని ఆ స్థలంలో 68 ఎకరాలు సుమారుగా 1953 లో 60 మంది పేద కుటుంబాలకు సాగు చేసుకునే నిమిత్తం పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. మిగతా 60 ఎకరాలు ప్రభుత్వ అధీనంలో ఉందన్నారు. ఈ భూములను తాము సోమవారం పరిశీలించామని చెప్పారు.

పారిశుధ్య కార్మికుల బాధలు పట్టించుకోండి

మరమ్మతులకు గురైన పుష్క్యాట్‌లు ... పట్టించుకోని అధికారులు

విధి నిర్వహణలో పారిశుధ్య కార్మికులు...పాడైన పుష్క్యాట్లు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్న కార్మికులకు చెత్త సేకరించి, వాటిని తరలించే పుష్క్యాట్‌లు సక్రమంగాలేవు. రోగాలు వ్యాప్తి చెందకుండా సమాజాన్ని కాపాడే వారిలో పారిశుధ్య కార్మికులు ముందు వరుసలో నిలుస్తారు. ప్రజారోగ్యంలో కీలకపాత్ర పోషించే పారిశుధ్య కార్మికుల కష్టాలు చెప్పనలివి కావు. వేర్వేరు కార్యక్రమాలకు ప్రజా ధనాన్ని లక్షలకు లక్షలు వెచ్చించే అధికారులు పుష్క్యాట్లు సరిగా లేకపోయినా వాటిని రిపేర్లు చేయించటం, లేదా కొత్తవి కొనుగోలు చేయాలన్న కనీస అలోచన చేయకపోవడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గత 25, 20 సంవత్సరాల నుంచి వాడిన పుష్క్యాట్లు రెండు, మూడేళ్లుగా పూర్తి స్థాయి మరమత్తుకు గురయ్యాయని, మరమ్మతులు చేయించలేని పరిస్థితికి వచ్చాయని కొత్తవి కొనుగోలు చేయాలని మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు అనేక మార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోకుండా అదిగో ... కొనుగోలు చేస్తున్నాం.. ఇదిగో కొనుగోలు చేస్తున్నాం.. అంటూ కాలం గడిపేస్తున్నారు. రోజుకు గతంలో 25 టన్నులు వస్తే ప్రస్తుతం సుమారు 60 టన్నుల చెత్త వస్తోందని పారిశుధ్య కార్మికులు చెబుతున్నారు. మున్సిపాలిటీ ఏర్పడిన కొత్తలో మూడు వార్డులకు ఒక పుష్ కార్డు చొప్పున 10 ఉండేవనీ, ప్రస్తుతం 38 వార్డులు అయినా వాటినే ఉపయోగించాల్సి వస్తోందని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. అధికారులు, క్షేత్రస్థాయిలో కార్మికులు కష్టాలను పరిశీలిస్తే వారి బాధలు అవగతమౌతాయి. కదలనని మెరాయిస్తున్న పుష్ క్యాట్‌లతో చెత్త సేకరించి తీసుకెళ్లడం ఎంతటి ఇబ్బందో పాలకులు గమనించాలని అంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని మేస్త్రీలు, కార్మికులు సొంత నిధులు వెచ్చించి మరమత్తు చేసుకోవ డం అదనపు భారంగా మారుతోంది. మరోవైపు కార్మికులకు రక్షణ పరికరాలైన మాస్కులు, గ్లౌజులు, కొబ్బరినూనె, చెప్పులు, యూనిఫాం వంటివి ఎప్పుడు ఇస్తారో.. ఎవరికీ తెలియని పరిస్థితి. మరోవైపు పుష్క్యాట్‌లలో ఉండే డస్ట్ బిన్‌లు లేకపోవడంతో చెత్త నిల్వ చేసే కేంద్రాల్లో వేసినప్పుడు ట్రాక్టర్ వచ్చి చెత్త సేకరించే వరకు వ్యర్థాలు పరిసరాల్లో పోగవడం వివాదాలకు దారి తీస్తోంది.ఇప్పటికైనా అధికారులు, పాలకులు, తమ కష్టాన్ని గుర్తించాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు.

అధ్యాపకురాలు వాసంతికి డాక్టరేట్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి గ్రామ పరిధిలోని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ఏమర్జింగ్ టెక్నాలజీ విభాగాధిపతురాలు పి.వాసంతికి విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీ-గుంటూరు నుండి డాక్టరేట్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వర రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిటెక్షన్ ఆఫ్ స్మాల్ అండ్ డెన్స్ ఆబ్జెక్ట్స్ యూజింగ్ యోలో వి ఫైవ్ అండ్ ట్రాన్స్‌ఫార్మర్ బేస్డ్ డీప్ లెర్నిం గ్ మోడల్స్ " అనే అంశంపై విజయవంతంగా పరిశోధన చేసిన నేపథ్యంలో ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకురాలు పి.వాసంతికి డాక్టరేట్ లభించింది. అసోసియేట్ ప్రొఫె సర్ డాక్టర్ లావణ్య మోహన్ ఆధ్వర్యంలో పరిశోధన చేసినందుకు గాను అకడమిక్ డాక్టరేట్ పట్టా విజ్ఞాన్ యూనివర్సిటీ అందించారని డాక్టరేట్ అవార్డు గ్రహీత పి.వాసంతి తెలిపారు. బోధించే వృత్తిలో ఉంటూనే ఉన్నత విధ్యనభ్యసించేందుకు సహకరించిన కళాశాల యాజమాన్యానికి డాక్టర్ వాసంతి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినం దన సభలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కరీం మోహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ తమ అధ్యాపకురాలు ఉన్నత విద్యలో అతు న్నత విద్యార్హత అకడమిక్ డాక్టరేట్ పట్టాను పొందడం తమ కళాశాలకే గర్వకారణమన్నారు. వివిధశాఖల విభాగాధిపతులు, భోదన, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వాసంతిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

గర్భిణులు ఆరోగ్య వంతంగా ఉండేందుకే పౌష్టికాహారం

గర్భిణీలకు పౌష్టికాహారం అందజేస్తున్న సమితి ప్రతినిధులు

పెద్దకూరపాడులో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న కృష్ణారావు

ప్రజాశక్తి - అమరావతి

గర్భిణీ స్త్రీలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడం అభినందనీయమని అమరావతి సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మొగసల మర్రి హరిబాబు అన్నారు. మండల కేంద్రమైన అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం బుచ్చియ్యపాలెం గ్రామ మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు సహకారంతో సోమవారం గర్భిణీలు స్కానింగ్, వివిధ పరీక్షల నిమిత్తం వచ్చిన మహిళలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు మాట్లాడుతూ గర్భిణీలు ఇంటి వద్ద కూడా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, వివిధ గ్రామాల నుండి వచ్చే గర్భిణీలు ఆకలితో ఇబ్బందులు పడకుండా ఉండాలనే మంచి ఉద్దేశంతో పౌష్టికాహారాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన పూర్ణచంద్రరావు అభినందనీయులనీ అన్నారు. గర్భిణీలు డాక్టర్ల సూచనలను పాటిస్తే ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు, జన చైతన్య సమితి ప్రతినిధులు గంజిమాల విజయ్ బాబు, బెజ్జం నాగేశ్వరరావు, సమాచారం సిబ్బంది మేకల శ్రీనివాసరావు, షేక్ శంషుద్దీన్, ఎడ్లూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు. జన చైతన్య సమితి నిర్వాహకులు గర్భిణీలకు పెరుగన్నం, గుడ్డు, డ్రైఫ్రూట్స్ లడ్డులు, అరటి పళ్ళు, శనగ విత్తనాల లడ్డులు పంపిణీ చేశారు.

పెదకూరపాడులో

మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణీలకు తాళ్లూరు, పెదకూరపాడు, సత్తెనపల్లి మండలంలోని ఫణిదం ప్రభుత్వ ఆసుపత్రిలో పౌష్టికాహారం అందజేశారు. ప్రతినెల 9వ తేదీన ఈ పౌష్టికాహారాన్ని పంపిణీ చేయటం ఆనవాయితీగా ఎంచుకున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణారావు, కిరణ్, ఆసుపత్రిసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యోగ దినోత్సవం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలోని గుర్రాల చావడి 5, 6, 7వ సచివాలయం పరిధిలో సోమవారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ షేక్‌రఫాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ కేవలం శారీరక వ్యాయామం కాదన్నారు. అనంతరం రాష్ట్ర టీడీపీ నాయకులు షేక్‌కరిముల్లా మాట్లాడుతూ యోగ అంతర్గత ప్రశాంతతను, ఆత్మజ్ఞానాన్ని పొందడానికి ఒక మార్గమన్నారు. అనంతరం పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్ మాట్లాడుతూ యోగ మనస్సు, శరీరం మధ్య సమతుల్యతను సాధించి, సంపూర్ణ జీవనానికి మార్గం సుగమం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, షేక్ అజారుద్దీన్. ఎస్‌ఎం కమల్‌బాషా. షేక్ జాని బాష. షేక్ రసూల్, అబ్దుల్లా. షేక్ కరీముల్లా. మజారుద్దీన్, సయ్యద్ రఫీ.హనీఫ్ బి. సయ్యద్ సలాం. పుల్లారావు, సయ్యద్ హుస్సేన్,మస్తాన్ వలి.అయబ్ ఖాన్.కోటి.సు భాని. బాలాజి. ఆయా సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సరైన ఆహారపు అలవాట్లు, మానసిక ఆరోగ్యం, శారీరక వ్యాయామంతో అనేక వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని ప్రముఖ హోమియో వైద్యురాలు డాక్టర్ ఉమాదేవి సిద్దా బత్తున చెప్పారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, ఉమాస్ హోమియో క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని సుగాలీకాలనీలో సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పిల్లల, మహిళల ఆరోగ్య సమస్యలు, మానసిక సమస్యలు, చర్మ స మస్యలు, ఆరోగ్య సమస్య లకు 80 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేసి, వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ చెడిపోయిన జీవనశైలి, ఆహార పదార్థాల్లో కల్తీ, పెరుగుతున్న కాలు ష్యం వంటి అనేక కారణాల వల్ల చిన్నవయసులోనే తీవ్ర వ్యాధుల బారిన పడుతున్నారని వివరించారు. దినచ ర్యలో వ్యాయామం, ధ్యానం, యోగా లేదా మరేదైనా శారీరక శ్రమ తప్పక చేయాలని సూచించారు. హోమియో మందులు పనిచేసే విధానం, తీసుకొనే పద్దతి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని, కార్యదర్శి నార్నే జయలక్ష్మి, సభ్యులు రమాదేవి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న మల్లికార్జున్

ఐపీఎస్ మ్యాచులను రద్దు చేయాలని తహశీల్దార్‌కు వినతిపత్రం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

యువతను పెడదారీ పట్టిస్తున్న ఐపీఎల్ మ్యాచ్లను వెంటనే రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఫ్ చిలకలూరిపేట ఏరియా కార్యదర్శి మల్లికార్జున్ డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డి.టీ.వెంకటేశ్వర్లుకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భగా మల్లికార్జున్ మాట్లాడుతూ ఐపీఎల్ మ్యాచులు యువతకు శాపంగా మారుతున్నాయని బెట్టింగుల వల్ల ప్రాణాలపై తెచ్చుకుంటూ కుటుంబాలను వీధిపాలు చేస్తున్నారన్నారు. ఐపిఎల్ మ్యాచులు వ్యాపారాలను పెంచు కోవడం డబ్బు సంపాదించుకోవడం తప్ప మరొకటి కాద న్నారు. బెట్టింగులను వెంటనే అరికట్టాలనీ యువతకు ప్రభుత్వమే అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రవివర్మ, లక్ష్మిపతి, నసీర్‌ఖాన్ పాల్గొన్నారు.

చేబ్రోలు, తెనాలి, పెదకాకానిలలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

ప్రజాశక్తి - చేబ్రోలు

యోగ మానసిక ఒత్తిడిని తగ్గించడానికి ఎంతో ఉపయోగపడుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.ఊహారాణ అన్నారు. సోమవారం మండల చేబ్రోలు ప్రధాన రహదారిలో యోగాంధ్ర భారీ ర్యాలీ నిర్వహించారు. చేబ్రోలు మండల ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న తహశీల్దార్ కె.శ్రీనివాస శర్మ పాల్గొనాన్నరు. ఎంపీడీవో ఊహారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రతిరోజు యోగాతో రోజును ప్రారంభించటం వలన చాలా ఆరోగ్యకరమైన, మానసిక ఒత్తిడి తగ్గించే ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. పని భారం వలన శారీరం, మానస్సు అధిక వత్తిడి, ఆందోళనలకు లోనవ్వడం వలన చిన్న వయసులోనే గుండెపోటు లాంటి ప్రమాదకర దుర్ఘటనలు సంభవిస్తున్నాయని వీటిని అధిగమించటానికి యోగ ఎంతో ప్రయోజనకరమైన మార్గం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎ ఓ ఉమాదేవి, హౌసింగ్ ఏఈ ఓబులు రెడ్డి, మండల కోఆర్డినేటర్ స్వచ్ఛభారత్ మిషన్, పంచాయితీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, ఏపిఎం శ్రీలక్ష్మి సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, డ్వాక్రా సంఘాల మహిళలు ఉపాధి హామీ శ్రామికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘ పరిధిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రజక పార్క్ నుండి పాత సత్యనారాయణ టాకీస్ రోడ్డు వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ చైర్పర్సన్ తాడిబోయిన రాధిక ప్రారంభించారు. రజకచెరువు కూడలి నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ చౌక్ చేరుకోగానే అక్కడ నవహారంగా ఏర్పడి యోగా దినోత్సవ ప్రాధాన్యతను చైర్పర్సన్ తో పాటు కమిషనర్ బి శేషన్న వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్అ త్తోట.నాగవేణి, 38వ వార్డ్ కౌన్సిలర్ వి విజయలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ వి.లక్ష్మీపతి, మేనేజర్ విల్సన్ జయకర్, మున్సిపల్ డిఈ శ్రీనివాసులు, అవుట్ డోర్, ఇండోర్ స్టాఫ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

మానసిక శారీరిక దఢత్వానికియోగ ఉపయోగపడు తుందని ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మేరకు పిలుపుమేరకు రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగ డే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన పెదకాకాని పరిధిలోని పలు గ్రామాలలో 173 కేంద్రాలలో యోగ శిక్షణ కార్యక్రమం జరుగుతుంది అన్నారు. వ్యాయామం, ధ్యనంతో పాటు యోగ కూడా సగటు మనిషి ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. సోమవారం ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించి పెదకాకాని ప్రధాన కూడలిలో ప్రదర్శన నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రజా పరిషత్ సిబ్బంది, పంచాయతీల కార్యదర్శులు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, యోగ శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తరలించొద్దు

ప్రజాశక్తి -తాడేపల్లి

కృష్ణా జిల్లా ఈడ్పుగల్లులో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఐఐటీ నీట్ మహిళా అకాడమీ (గురుకుల పాఠశాల) వేరేచోటకు తరలించే ప్రయత్నం విరమించాలని కోరుతూ సోమవారం ఇంటర్మీడియట్ విద్యార్థులు వందలాదిమంది తాడేపల్లిలోని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ కార్యాలయముగా ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులకు గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

11న సాహిత్య బాటసారి శారద పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి

అభ్యుదయ రచయితల సంఘం, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11న స్థానిక ఏ ఎస్ ఎన్ డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు 'సాహిత్య బాటసారి శారద స్మృతి శకలాలు' పుస్తకావిష్కరణ సభ జరుగుతుందని అరసం జిల్లా అధ్యక్షులు చెరుకుమల్లి సింగారావు తెలిపారు. అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ పాల్గొంటారని తెలిపారు. 1985లో ఆలూరి భుజంగ రావు రచించిన పుస్తకాన్ని తెనాలి ఇంప్రెషన్స్ పున: ముద్రణ చేసింది.

సిపిఎం అభిమాని తాయారమ్మ మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

తాయారమ్మ (ఫైల్)

కొలనుకొండ గ్రామానికి చెందిన సిపిఎం అభిమాని కాట్రగడ్డ తాయారమ్మ (58) సోమవారం ఉదయం గుండెపోటుతో కన్ను మూసింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త కాట్రగడ్డ వెంకట నారాయణ గతంలెపూ చనిపోయారు. గ్రామంలో సిపిఎం నిర్వహించే అనేక కార్యక్రమాలలో భర్త వెంకట్ నారాయణ కుటుంబం చురుగ్గా పాల్గొనేవారు. సోమవారం తన కుమారుడు తో కలిసి, తయారమ్మ ద్విచక్ర వాహనంపై చీరాల నుండి ఇంటికి తిరిగి వస్తుండగా ప్రత్తిపాడు సమీపంలో ఛాతిలో నొప్పి రావడంతో అప్రమత్తమైన తన కుమారుడు సాంబశివరావు పత్తిపాడు సమీపంలో స్థానిక వైద్యుడు వద్దకు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయగా అప్పటికే తయారమ్మ మృతి చెందింది. సిపిఎం సీనియర్ నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, తాడేపల్లి మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు కొలనుకొండలోని తాయారమ్మ నివాసములోని ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కె.శివన్నారాయణ, కాట్రగడ్డ పూర్ణయ్య, కాజా శ్రీనివాసరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి - గుంటూరు

యోగాను ప్రతిఒక్కరూ జీవనవిధానంలో భాగం చేసుకుంటే మెరుగైన ఆరోగ్యాన్ని పొందడానికి వీలుంటుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025లో భాగంగా జిల్లా కలెక్టరేట్ నుండి నగరంపాలెం 3 బొమ్మల సెంటర్ వరకు యోగాపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో షుమారు కోటి మందికి యోగాను పరిచయం చేయడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపిఐడిసి చైర్మన్ డేగల ప్రభాకర్, జిఎంసి డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, జిఎంసి అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంగళగిరి నుండి అమరావతికి ఆర్టీసీ బస్సులు నడపరా..

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్

ప్రముఖ పుణ్యక్షేత్రం, ఎంతో చారిత్రిక, చరిత్ర కలిగిన అమరావతికి మంగళగిరి నుండి ఒక్క ఆర్టీసీ బస్సు కూడా లేకపోవడం ఎంతో విస్మయాన్ని కలిగిస్తుంది. మంగళగిరి డిపో నుండి గతంలో ఆర్టీసీ బస్సు నడిచేవని మంగళగిరి ప్రాంత వాసులందరూ పుణ్యక్షేత్రమైన అమరావతి అధికంగా ప్రయాణికులు ప్రయాణించేవారు. ప్రస్తుతం మంగళగిరి డిపో నుండి ఒక్క ఆర్టీసీ బస్సు లేదు. గతంలో మంగళగిరి బస్టాండ్ నుండి అమరావతికి గంటకు ఒక బస్సు సంవత్సరం నుండి బస్సులు నడపడం లేదు. ఈ ప్రాంత వాసులందరూ విజయవాడ, గుంటూరు, ఎర్ర పాలెం వెళ్లి విజయవాడ నుండి వచ్చే బస్సులలో వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రయాణికులు అంటున్నారు. మంగళగిరి నుండి అమరావతి వెళ్లే ఆర్టీసీ బస్సు శిబిరం, బాపూజీ నగర్, నిడమర్రు, కురగల్లు, ఎస్ ఆర్ ఎమ్, నీరుకొండ, పెదపరిమి, అనంతవరం, వడ్లమాను, మద్దూరు మీదుగా అమరావతి చేరుకుంటుంది. ప్రస్తుతం మంగళగిరి నుండి అమరావతి వెళ్లేందుకు ఒక్క ఆర్టీసీ బస్సు కూడా లేకపోవడంతో ఈ గ్రామాల్లోని ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర రాజధాని పేరు పెట్టిన అమరావతికి ఆర్టీసీ బస్సులు లేకపోవటం ఏమిటని ఈ ప్రాంత వాసులంతా ఆర్టీసీ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోడ్లు సరిగా లేవని సాకుతో బస్సులు నిలిపివేశారు. ప్రస్తుతం మంగళగిరి నుండి అమరావతి వరకు రోడ్లు సక్రమంగా ఉన్నాయి. అయినా బస్సులు ఎందుకు నడవడం లేదు ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యమా అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు తక్షణమే మంగళగిరి డిపో నుండి రాజధాని అమరావతికి బస్సులు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



188వ రోజులు చేరిన కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఎసి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు సోమవారం నాటికి 188 రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కె.అంజమ్మ, సారమ్మ, శివమ్మ, దుర్గమ్మ కూర్చున్నారు. దీక్షను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, సాంబయ్య, నాగేశ్వరరావు, ఆరిఫ్, స్మైల్ తదితరులు పాల్గొన్నారు. సిఐటియు నాయకులు దుర్గారావు మాట్లాడుతూ రాజధాని మహిళ పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు చేయటం సరైనది కాదని విమర్శించారు. ఎసిసి కార్మికులు ఇన్ని రోజులు పోరాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా అన్యాయమని ఆయన ఆవేదన చెందారు. ఇప్పటికైనా నారా లోకేష్ ఎసిసి కార్మికు ఇచ్చిన హామీ ప్రకారం సమస్య పరిష్కారానికి పూనుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న చైర్‌పర్సన్, కమిషనర్, సిబ్బంది

విజన్ యాక్షన్ ప్లాన్‌పై సిఎం వీడియో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ చైర్ పర్సన్ తాడిపోయిన రాధిక కమిషనర్ బి శేషన్న, మున్సిపల్ సిబ్బంది వీక్షించారు. ముఖ్యమంత్రి సందేశాన్ని వారు విన్నారు. కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ పెదలంక లక్ష్మీ లావణ్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్స్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం, రెవెన్యూ, ప్రజారోగ్యం, మెప్మా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి - తెనాలిరూరల్

తల్లితండ్రులను విస్మరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని, వారిని చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహశీల్దార్ కె.వి. గోపాలకృష్ణ అన్నారు. ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి నాలుగు అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ సమస్యపై ఒకటి, రేషన్ కార్డు మ్యూటేషన్, కొలకలూరులో దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతంపై ఒకటి, తల్లిదండ్రులను చూడట్లేదన్న ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎమ్మార్వో గోపాలకఅష్ణ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలతో వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని, ముఖ్యంగా వఅద్ధాప్యంలో తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గోపాలకృష్ణ సూచించారు. తల్లిదండ్రుల పోషణ బాధ్యతలను విస్మరించిన వారిపై శాఖాపరంగా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి అత్తోట దీప్తి, పలు శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న సాంబశివరావు

ఉచితంగా మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం, శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళగిరి గౌతమబుద్ధా రోడ్డు వద్ద శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం కార్యాలయం ఎదుట శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ చైర్మన్, శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద సోమవారం ఉచిత మజ్జిగ పంపిణీ జరిగింది. పాదచారులకు, వాహనదారులకు, ఆర్టీసీ బస్సుల ప్రయాణికులకు చల్లటి మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు, నంగళం ప్రసాదు, కర్నాటి శివసత్య నారాయణ, గండికోట వీరరాఘవులు, గండికోట అచ్చియ్య, పంచల శివన్నారాయణ, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, నల్లమోలు నాగరాజు, బేతపూడి మధుబాబు, రెడ్డి వీరరాఘవులు, నంద్యాల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ తో మాట్లాడుతున్న పసుపు రైతుల సంఘం నాయకులు

పరిహారం చెల్లించకుంటే ఆందోళన

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

సబ్‌కలెక్టర్‌కు సమస్య విన్నవించిన రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి- తెనాలి

దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు జూన్ నెలాఖరు లోగా పరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆంధ్ర ప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివ శంకరావు హెచ్చరించారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, సబ్ కలెక్టర్ సంజనా సింహకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివ శంకరరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగి 17 నెలలు గడుస్తున్నా బాధిత పసుపు రైతులకు పరిహారం అందకపోవటం శోచనీయమన్నారు. కోల్డ్ స్టోరేజ్ లో దాచుకుంటే మంచి ధర వస్తుందన్న ఆశతో బ్యాంకు వడ్డీలు, ఇన్సూరెన్స్ ప్రీమియం, కోల్డ్ స్టోరేజీ అద్దెలు భరించి రైతులు పంటను దాచుకుంటే, స్టోరేజ్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా పంట అగ్నికి ఆహుతి అయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిలో కోల్డ్ స్టోరేజ్ యాజమాన్య వైఫల్యం ఉందన్నారు. దశల వారీగా చేసిన ఆందోళన ఫలితంగా ప్రభుత్వం స్పందించి క్వింటాల్‌కు రూ.7వేలు ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ మంత్రి సాక్షిగా రైతులకు హామీ ఇచ్చారన్నారు. కానీ నేటికీ చిల్లిగవ్వ కూడా రైతులకు దక్కలేదన్నారు. పసుపు రైతులకు పరిహారం చెల్లించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అగ్ని బాధిత పసుపు రైతుల సంఘం నాయకులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ 2025 జనవరి 20నాటికి అగ్ని ప్రమాదం జరిగి సంవత్సరం అయిన నేపథ్యంలో మారిస్ పేట న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ ముందు ధర్నాకు పిలుపునిచ్చామని, దీనికి స్పందించిన మంత్రి లోకేష్ కార్యాలయం నుండి పది రోజులు పాటు కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని కోరిన సందర్భాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం మాట మీద నమ్మకంతో ఆందోళన వాయిదా వేసుకోవటం జరిగిందని తెలిపారు. కాని ఐదు నెలలు గడుస్తున్నా పరిహారం చెల్లింపులో పురోగతి లేదని ఆయన మండిపడ్డారు. ఈ నెలలో పరిహారం అందకపోతే ఆందోళన తథ్యమన్నారు. సబ్ కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ సమస్య తీవ్రతను ఉన్నతాధికారులు దృష్టికి, ఇన్సూరెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత మంత్రితో మాట్లాడటం జరిగిందని, ఒక వారం రోజుల లోగా పరిహారం అందుతుందన్న ఆశా భావాన్ని సబ్ కలెక్టర్ వ్యక్తం చేసినట్లు నాయకులు చెప్పారు. కార్యక్రమంలో పసుపు రైతులు నాదెళ్ల చంద్రశేఖర రావు, కొమ్మారెడ్డి రంగారెడ్డి, రేవతి వెంకట సత్యనారాయణ, ఎర్రు వెంకటేశ్వరరావు, ఆళ్ల వెంకటప్ప రెడ్డి, చందు రామారావు, సిఐటియు తెనాలి కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి, తెనాలి రైతు సంఘం అధ్యక్షులు ముద్దన సాంబశివరావు, భీమవరపు చినరామిరెడ్డి, గోపిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు విద్యాభవన్‌ను ముట్టడిస్తాం

గుంటూరులో నిరాహార దీక్షలు చేపట్టిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎస్‌జిటి ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్‌కు ఒప్పుకునే వరకూ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే నేడు విద్యా భవన్‌ను ముట్టడిస్తామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు హెచ్చరించారు. ఎస్‌జిటిలకు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించటాన్ని వ్యతిరేకిస్తూ వరుసగా రెండో రోజు ఆందోళనలో భాగంగా గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలకు ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు కె.బసవలింగారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె.బసవలింగారావు, ఎం.కళాదర్, పెదబాబు, జీవి రామకష్ణ, సోషలిజం, మాటాడుతూ ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన విద్యా శాఖాధికారులు మోసపూరితంగా వెబ్ ఆప్షన్స్‌కి ఉపాధ్యాయులపై వత్తిడి పెట్టట్టం అన్యాయం అని అన్నారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా వారి అభిప్రాయాలను పెడచెవిన పెట్టటం అప్రజాస్వామికం అన్నారు. పుండుమీద కారం చల్లినట్లు విద్యాశాఖామంత్రి లోకేష్ మాన్యువల్ కౌన్సెలింగ్‌కి చట్టం అడ్డం వస్తుందని చెప్పడం నమ్మిన ఉపాధ్యాయులను మోసం చేయడమేనన్నారు. ఉపాధ్యాయులు ఆందోళనతో రోడ్లు ఎక్కితే సమస్యను సానుకూలంగా స్పందించి పరిష్కరించని విద్యామంత్రి చోద్యం చూస్తూ, ఇప్పటికే చాలా చేశామని చెప్పడం సరైనది కాదన్నారు. గత ముఖ్యమంత్రి సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసినట్లే ఇప్పుడు విద్యాశాఖా మంత్రి జీఓ117 రద్దు, తెలుగు మాధ్యమం పునరుద్ధరణ, వర్క్‌లోడ్ పెంచడం లాంటి మూడు హామీలు ఇచ్చి మాట తప్పారన్నారు. ఉపాధ్యాయులు ఒక పక్క ఆందోళలు చేస్తుంటే మరోవైపు డిఇఒ ఆఫీసు, ఎంఇఒ ఆఫీసు నుండి ఫోన్లు చేసి, వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని ఒత్తిడి చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. వెబ్ ఆప్షన్స్ పెటుకోవద్దని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మాన్యువల్ కౌన్సెలింగ్ విషయంలో ప్రభుత్వం కొద్దిమంది అధికారుల పక్షమో, వేలాది మంది ఉపాధ్యాయుల పక్షమో తేల్చుకోవాలన్నారు. తొలుత దీక్షలను సీనియర్ నాయకురాలు కుసుమకుమారి ప్రారంభించారు. దీక్షా శిబిరంలో ఎం.హనుమంతరావు, రామచంద్రయ్య, మహమ్మద్ ఖాలీద్, సుబ్బారెడ్డి, వినయ్, సంపత్, షకీలాబేగం, జి.దాస్, కె.కష్ణారావు, సుభాని, ప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలి

గుంటూరులో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నిరసన

నిరసనలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న కార్మికులకు మద్దతుగా సోమవారం స్థానిక శంకర్ విలాస్‌సెంటర్‌లో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ విశాఖలో 1600 రోజుల నుండి కార్మికులు విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఆందోళన చేస్తున్నా రని అన్నారు. ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిరక్షణకు ఒక ప్రకటనలు చేస్తూ, ఆచరణలో ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేస్తుందన్నారు. విశాఖ ఉక్కును పరిరక్షిస్తారని విశాఖ ప్రజలు అత్యధిక మెజారిటీతో కూటమిని గెలిపించారని, కానీ అదే నాయకులు నేడు విశాఖ ఉక్కుపై విషం చిమ్మే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దీక్షలు చేసిన పల్లా శ్రీనివాసరావు నేడు ఎందుకు నోరు మెదపట్లేదన్నారు. 5500 మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించడం అంటే విశాఖ ఉక్కును పరిరక్షించటమా అని ప్రశ్నించారు.ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తొలగించిన కార్మికుల్ని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. శాంతియుతంగా దీక్షలు చేస్తున్న వారిని రోడ్డుపైకి నెట్టివేయటం అన్యాయం అన్నారు. ప్రభుత్వం కార్మికులపై నిర్బంధం ప్రయోగిస్తే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. అరుణ్ కుమార్, ఎం. హనుమంతరావు, ఎపిఎఫ్‌టియు నాయకులు మేకల రవి, సిఐటియు పశ్చిమ నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, అధ్యక్షులు బి.సత్యనారాయణ, నాయకులు చింతల శ్రీనివాసరావు, దీవెనరావు, పి.శ్రీనివాసరావు, నారాయణ, గణేష్, ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఆర్.అంజిబాబు, నాయకులు చల్లా చిన్న ఆంజనేయులు, జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాపనలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ, ఇతర అధికారులు

బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎఎస్‌పి సుప్రజ

గ్రీవెన్స్‌కు తగ్గిన విజ్ఞాపనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి విజ్ఞాపనలు క్రమంగా తగ్గుతున్నాయి. ప్రజలు ఇచ్చిన విజ్ఞాపనలకు అధికారుల నుంచి పరిష్కారం లభించకపోతుండటంతో పిజిఆర్ఎస్‌కు వచ్చే వారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. వినతులు ఇచ్చే వారిలో భూ సమస్యలను ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. అలాగే వ్యక్తిగత వివాదాలు కూడా ఉంటున్నాయి.ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై వినతులు తక్కువగా వస్తున్నాయి.

స్థల ఆక్రమణపై ఫిర్యాదు : గ్రామంలో ఉన్న ఆరు సెంట్ల స్థలాన్ని వేరే వారు ఆక్రమించుకున్నారని మేడికొండూరు మండలం, కొర్రపాడు గ్రామానికి చెందిన యద్దనపూడి పూర్ణచంద్రరావు ఫిర్యాదు చేశారు. వేరే గ్రామాలకు వెళ్లి వస్త్రాలు అమ్ముతూ ఉపాధి పొందుతున్నానని ఆ సమయంలో స్థలాన్ని ఆక్రమించుకున్నారని అధికారులకు తెలిపారు. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులను కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. నాకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని ఈ స్థలం పైనే ఆధారపడ్డామని ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశం కల్పించండి: తన కుమారుడికి గురుకుల పాఠశాలలో ప్రవేశం కల్పించాలని పల్నాడు జిల్లా మాచవరం మండలం గంగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గంగవరం నాగేశ్వరరావు అర్జీ అందజేశారు. గత ఏడాది ప్రవేశానికి అనుమతి పొందిన సమయంలో రోడ్డు ప్రమాదంలో తన కుమారుడు గాయపడ్డాడని దీంతో కోలుకున్న తర్వాత వేరే పాఠశాలకు పంపామని చెప్పారు . ఏడాది ప్రవేశానికి దరఖాస్తు చేసుకోగా గత ఏడాది రానుందన ఈ ఏడాది తీసుకోబోమని అధికారులు చెబుతున్నారని తెలిపారు. నిరుపేద కుటుం బానికి చెందిన వారమని ఉన్నతాధికారుల దష్టిలో పెట్టుకొని సత్తెనపల్లి మండలం అచ్చంపేట, అడవితక్కెళ్ళపాడు లో మరోచోటైన సీటు ఇప్పించాలని కోరారు.

యానిమేటర్ అక్రమాలపై ఫిర్యాదు : తమకు తెలియకుండానే డిసిసిబి నుంచి తమ పేరున రుణాలు పొందిన యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక అంకిరెడ్డి పాలెంకు చెందిన డ్వాక్రా మహిళలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సహకార బ్యాంక్ లో ఎక్కువ రుణం వస్తుందని ఆశ చూపి తమ వద్ద సంతకాలు తీసుకున్నారని ఆ తరువాత మరో బ్యాంకులో రుణం ఇప్పించారని తెలిపారు. తాము రుణం తీసుకున్న బ్యాంకులో రుణం సొమ్ము చెల్లించగా సహకార బ్యాంకులో కూడా బాకీ ఉందంటూ అధికారులు తమ వద్దకు వస్తున్నారని వారు ఫిర్యాదు చేశారు. నల్లపాడు సహకార బ్యాంకు నోటీసులతో అంకిరెడ్డిపాలెం డ్వాక్రా సంఘాల మహిళలు అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. నల్లపాడు సహకార బ్యాంకులో తాము అసలు రుణం తీసుకోలేదని, సభ్యుల పేర్లతో రుణాలు పొంది నట్లు నోటీసులు వచ్చాయన్నారు. యానిమేటర్ సోనియా తప్పుడు సంత కాలతో అక్రమంగా రుణాలు పొందారని గ్రహించిన సభ్యులు కలెక్టరేట్ లో అధి . కారులకు పిర్యాదు చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

అధిక వడ్డీలతో వేధింపులు : అప్పు వడ్డీతో సహా చెల్లించినా ఇంకా అదనపు సొమ్ము చెల్లించాలని వత్తిడి చేస్తూ సొమ్ము ఇవ్వకపోతే వెంటనే ఇల్లు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నట్టు స్థానిక రత్నగిరి కాలనీకి చెందిన బండారు నాగేశ్వరరావు జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. ఎడ్లపాడు గ్రామానికి చెందిన బండారు కోటేశ్వరరావు, బండారు దుర్గ, బండారు యశోద లను తక్షణమే అరెస్ట్ చేయాలని బండారు నాగేశ్వరరావు ఎస్పి కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు బంధువులు కంభం ఆనంద కుమార్, జొన్నకూటి పున్నమ్మ మాట్లాడుతూ వడ్డీకి తీసుకున్న డబ్బులు చెల్లించినా.. నీవు ఇంకా డబ్బులు కట్టాలని, బండారు తిరుపతమ్మను పదిమంది లో అసభ్యకరంగా తిట్టి, చెప్పులతో కొట్టి అమమానించ్చారని చెప్పారు. నాకు జరిగిన ఈ అవమానం భరించలేనని, నాకు బ్రతకాలని లేదని, నేను ఆత్మహత్య చేసుకుంటానని, ఇంటిలోనుంచి వెళ్లిపోయిందని తెలిపారు. బండారు తిరుపతమ్మ ఎక్కడ ఉందో తెలియదు, అసలు బ్రతికే ఉందా... ఉంటే ఎక్కడ ఉందో తెలియదని చెప్పారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయాలని వారు కోరారు.

త్రిబుల్ ఎక్స్ కంపెనీపై ఫిర్యాదు : త్రిబుల్ ఎక్స్ కంపెనీ అధినేత మాణిక్యవేలు మృతి చెందిన తరువాత జరిగిన అంత్యక్రియల్లో కాల్చిన బాణా సంచా వల్ల తమ కుమారుడు ఈశ్వర్ అలియాస్ కోటి(14ఏళ్లు) గాయపడ్డాడని కానీ సంస్థ వారు ఇంత వరకు తమను పట్టించుకోవడం లేదని గుంటూరు గుండారావుపేటకు చెందిన దొంతలూరి లీలారావు ఫిర్యాదు చేశారు. ఈ సంస్థ వారు అంతిమ యాత్రలో బాణా సంచా కాల్చేందుకు 14 ఏళ్ల లోపు బాలలను వినియోగించు కున్నారని ఫిర్యాదు చేశారు. అక్కడ భారీ సంఖ్యలో టపాసులను ఒక టాటా ఏసీ వాహనంలో లోడ్ చేయించుకొని ఈ పిల్లల లను శవయాత్ర లో ముందు టపాసులు పేల్చమని భారతి కన్స్యూమర్ కేర్ ప్రతినిధి అయిన హనుమాన్ ప్రసాద్ చెప్పాడని ఈ సందర్భంగా జరిగిన పేలుడులో తమ కుమారుడు మంటల్లో కాలి 70 శాతం గాయపడ్డాడని, స్థానిక రమేష్ ఆస్పత్రిలో చేర్పించి తమకు ఫోన్ చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. వైద్య ఖర్చులు తామే భరిస్తామని చెప్పిన హనుమాన్ ప్రసాద్ తరువాత ముఖం చాటేశారని, ఆస్పత్రి వారు తమను రూ.2 లక్షలు చెల్లించమన్నారని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదం జరిగినా పట్టించుకోకుండా యాజమాన్యం వదిలివేయడం దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు. తాము పేద వర్గానికి చెందిన అతి తక్కువ కులానికి చెందిన వారమన అందువల్లే తమను చిన్నచూపు చూశారన్నారు.